సాక్షి పెద్దపల్లి
మంగళవారం । 4 । జూన్ । 2024



నృసింహుని సన్నిధిలో పూజలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కుటుంబసమేతంగా సోమవారం ధర్మపురి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు.



జీడీకే–11గని తనిఖీ

గోదావరిఖని: ఇటీవల జరిగిన ప్రమాదంలో కార్మికుడు మృతి చెందడంతోపాటు మరో కార్మికుడు గాయపడిన నేపథ్యంలో కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సోమవారం జీడీకే–11గనిని సందర్శించారు. పనిస్థలాలు పరిశీలించారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.0/28.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది.అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్తమ ఉద్యోగికి ప్రశంస



ప్రశంస పత్రం అందుకుంటున్న నాగరాజు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ విద్యుత్ సెక్షన్‌లో జూనియర్ లైన్‌మెన్ గుమ్ముల నాగరాజు విధి నిర్వహణలో అందిస్తున్న సేవలకు ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. ఈమేరకు వరంగల్‌లో టీజీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి నుంచి నాగరాజు ప్రశంస పత్రం అందుకున్నారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్, మంథని డివిజనల్ ఇంజినీర్ ఈశ్వరప్రసాద్ తదితరులు నాగరాజును అభినందించారు.

5న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పెద్దపల్లిరూరల్: స్థానిక రంగంపల్లి చీకురాయి క్రాస్‌రోడ్డులోని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయంలో ఈనెల 5న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్ సోమవారం తెలిపారు. ఇందులో కొత్తగా విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం, బిల్లుల్లో వ్యత్యాసాలు, కేటగిరీ మార్పులో ఇబ్బందులు, లూస్ లైన్లు సరిచేయం, సాగు భూముల్లో వేలాడే తీగలు, కొత్తస్తంభాల ఏర్పాటులో సమస్యలను వేదిక ద్వారా పరిష్కరిస్తామని వివరించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయనకోరారు.

రాష్ట్ర చిహ్నం నమూనా అందజేత

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం కొత్త చిహ్నాన్ని అమల్లోకి తేవాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేశ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఏవోను కలిసి చిహ్నం నమూనా అందజేశారు. దానిని ప్రభుత్వానికి నివేదించాలని కోరామన్నారు. నాయకులు శంకరయ్య, రమేశ్, రాజు, అవినాష్, సతీశ్, ప్రవీణ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గోదావరిఖని: తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 5నుంచి నిరవధిక సమ్మె చేస్తామని సింగరేణి అద్దె వాహన యాజమానుల సంఘం నాయకులు హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈఏడాది ఏప్రిల్ నుంచి డ్రైవర్లకు సీఎంపీఎఫ్ చెల్లించేందుకు అంగీకరించినా.. సింగరేణి సీఎండీ అనుకూలంగా ఉన్నా.. కార్పొరేట్ కమిటీ ఒప్పుకోవడం లేదని మండిపడ్డారు. లైవ్ వాహనాలకు పాతరేట్లు కొనసాగుతుండగా, కొత్త వాహనాలకు రేట్లు పెంచారని పేర్కొన్నారు. కొత్త వాహనాల ధరల ప్రకారం లైవ్ వాహనాలకు కూడా అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు.

విజేత ఎవరో..?

- మరికొద్ది గంటల్లో తేలనున్న పార్లమెంట్ అభ్యర్థుల భవితవ్యం
- ఈవీఎంలలో నిక్షిప్తమైన 10,83,453మంది ఓటర్ల తీర్పు
- ఉదయం 8 నుంచే మంథని, జేఎన్టీయూ, మంచిర్యాల ఐజా కాలేజీలో కౌంటింగ్ ప్రారంభం
- తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికలు ముగిసి వారాలు తరిగిపోయాయి. రోజులు గడిచిపోయాయి. మిగిలింది గంటలు, ఘడియలే. ఓటర్లు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్న ఈవీఎంలలో నిక్షిప్తమైన తీర్పు మరికొద్ది గంటల్లో తేలనున్నంది. పెద్దపల్లి నుంచి ఢిల్లీ వెళ్లే రాజు ఎవరో మంగళవారం తేలనుంది. మార్చి 16న నోటిఫికేషన్‌తో మొదలైన ఎన్నికల సందడి.. సుమారు 62 రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచారం తర్వాత మే 13న పోలింగ్‌తో ముగిసింది. పోలింగ్ తర్వాత 22 రోజుల అనంతరం ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, గెలుపుపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి ధీమావారు వ్యక్తం చేస్తున్నారు.

పార్లమెంట్ బరిలో 42 మంది

- పెద్దపల్లి పార్లమెంట్ బరిలో 42 మంది అభ్యర్థులు నిలిచారు.
- ప్రధానంగా కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి గోమాసె శ్రీనివాస్ పోటాపోటీగా ప్రచారం చేశారు.
- పార్లమెంట్ పరిధిలోని 15,96,430 మంది ఓటర్లలో 67.87శాతం అంటే.. 10,83,453మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ప్రస్తుత ఓట్ల లెక్కింపులో 567మంది సిబ్బంది పాలుపంచుకుంటారు.

తొలుత పోస్టల్ బ్యాలెట్లు

తొలుత పోస్టల్ బ్యాలెట్లను ఉదయం 8గంటలకు లెక్కిస్తారు. ఆ తర్వాత ఈవీఎంల కౌంటింగ్ చేపడతారు. వీటికోసం ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఏఆర్వో ఉంటారు. ఒకరౌండ్ పూర్తయ్యాక ఆర్వో, జనరల్ అబ్జర్వర్ 14 టేబుళ్లను ర్యాండమ్‌గా తనిఖీ చేస్తారు. వీరి పరిశీలన తర్వాతే ఆ రౌండ్ ఫలితం ప్రకటిస్తారు. రౌండ్ల వారీగా స్క్రీన్‌పై ఫలితాలు డిస్‌ప్లే చేస్తారు. అభ్యర్థితోపాటు 14 టేబుళ్లకు 14 మంది ఏజెంట్లు ఉంటారు. ప్రతీ రౌండ్ లెక్కింపును వీరు పరిశీలిస్తారు. ఒక్కో రౌండ్ లెక్కింపు 20 – 30 నిమిషాల్లో పూర్తవుతుంది. తొలుత ఇప్పటివరకు వచ్చిన 12,897 పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు.

రెండు కౌంటింగ్ కేంద్రాల్లో.. పోస్టల్ ఓట్లతో...

- రామగిరి జేఎన్టీయూలో పెద్దపల్లి, ధర్మపురి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తారు.
- మంచిర్యాల ఐజా కాలేజీలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు ఓట్లు లెక్కించనున్నారు.
- రెండు కేంద్రాల్లో అసెంబ్లీల వారీగా కౌంటింగ్ హాళ్లు వేర్వేరుగా ఏర్పాటుచేశారు.
- పార్లమెంట్ పరిధిలో అత్యధిక పోలింగ్ కేంద్రాలు ఉన్న పెద్దపల్లి, మంథని (290) నియోజకవర్గ ఫలితాల కోసం 21 రౌండ్లు, అతి తక్కువ ఉన్న చెన్నూరు, బెల్లంపల్లి(227) ఫలితాలు 16 రౌండ్లలో తేలుతాయి.
- రౌండ్ల వారీగా లెక్కింపు పూర్తయిన వెంటనే లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఏజెంట్ల సమక్షంలో లాటరీ పద్ధతిన నియోజకవర్గానికి ఏవేని ఐదు వీవీప్యాట్లను ఎంపిక చేసి, వాటిల్లోని స్లిప్పులను లెక్కిస్తారు.
- స్లిప్పులు, ఈవీఎంలలోని ఓట్లతో సరిపోలితేనే ఫలితాలు వెల్లడిస్తారు.
- ఇలా మొత్తం 35 వీవీప్యాట్ల స్లిప్పులను లెక్కించేందుకు సుమారు 2గంటల – 3గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ తర్వాతే ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తారు.



జేఎన్టీయూలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగిరి(మంథని): పెద్దపల్లి పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు మంథని జేఎన్టీయూలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని తెలిపారు. మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల పరిశీలకుడు రాజీవ్‌గుప్తా, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, దివాకర, పెద్దపల్లి, మంథని సహాయ రిటర్నింగ్ అధికారులు గంగయ్య, హనుమా నాయక్, మీడియా నోడల్ అధికారి రవీందర్ ఉన్నారు. ఆ తర్వాత ఓట్ల లెక్కింపు శిక్షణ పొందుతున్న అధికారులను కలెక్టర్ కలుసుకున్నారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 5 గంటలకు కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలని, గుర్తింపుకార్డు వెంట తీసుకొని రావాలని, సెల్‌ఫోన్లకు అనుమతి ఉండదని కలెక్టర్ సూచించారు.

ఎవరి ధీమా వారిదే..

- ఎంపీ ఎన్నికల్లో విజయం తమదంటే తమదేనని ఆయా పార్టీల అభ్యర్థులు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.
- అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు హవాతో పెద్దపల్లిపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ నేతలు, జాతీయ అంశాలు, మోదీ హవా, అయోధ్య ఆలయ నిర్మాణం, సైలెంట్ ఓటింగ్ కలిసి వస్తుందనే ధీమాలో బీజేపీ శ్రేణులు, ప్రభుత్వ వ్యతిరేకత, కేసీఆర్ ఇమేజ్‌తో గెలుపుపై బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు	మొత్తం ఓట్లు	పోలైనవి	పోలింగ్ శాతం
చెన్నూరు	227	16	1,93,778	1,32,787	68.53
బెల్లంపల్లి	227	16	1,76,514	1,25,255	70.96
మంచిర్యాల	287	21	2,78,738	1,69,591	60.84
ధర్మపురి	269	19	2,30,786	1,69,258	73.34
రామగుండం	260	19	2,19,723	1,35,330	61.59
మంథని	290	21	2,39,699	1,67,750	69.98
పెద్దపల్లి	290	21	2,57,192	1,83,482	71.34
మొత్తం	1,850	132	15,96,430	10,83,453	67.87

స్వరాష్ట్రం.. ప్రగతి పథం

సాక్షి, పెద్దపల్లి: గడిచిన దశాబ్దంలో సింగరేణి బొగ్గు గనుల సంస్థ స్వరాష్ట్రంలో ప్రగతి పథంలో ముందుకు సాగింది. బొగ్గు ఉత్పత్తితోపాటు థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో తనకంటూ ప్రత్యేకత చాటుకుంది. రాబోయే రోజుల్లో జల, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఏటా 52.54 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే దశ నుంచి 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా దూసుకెళ్తోంది. కార్మికుల క్వార్టర్లకు ఉచిత విద్యుత్, సొంతింటిపై రూ.10లక్షలు వడ్డీలేని, కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు.. ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. స్వరాష్ట్రంలో గతపదేళ్లలో సింగరేణి సాధించిన అభివృద్ధిపై ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు..



జీఎం శ్రీనివాస్

- అభివృద్ధిలో సింగరేణి పరుగులు
- దేశంలోనే అగ్రగామి సంస్థగా ఆవిర్భావం
- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్

- **స్వరాష్ట్రంలో సింగరేణి ప్రారంభించిన కొత్తగనులు ఎన్ని?**
- తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోంది. విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు అవసరమైన కరెంట్ ఉత్పత్తికి కొత్త బొగ్గు గనులు అవసరం. మనరాష్ట్రంతోపాటు మరో 8 రాష్ట్రాల్లోని 20 థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఒప్పందం ప్రకారం బొగ్గును సరఫరా చేస్తోంది. దేశసేవలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. ఇందులో భాగంగా కొత్తగూడెంలోని వీకే ఓపెన్‌కాస్ట్, రామగుండం కోల్ మైన్, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓసీపీ, బెల్లంపల్లిలోని గోలేటి ఓసీపీని ఈఏడాది ప్రారంభించుకుంటాం. సెమీ మెకనైజ్డ్ నుంచి పూర్తిస్థాయి యాంత్రీకరణ దిశగా ముందుకు వెళ్తున్నాం.
- **కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు ఏమిటి?**
- కార్మికుల సంక్షేమం కోసం రాజీలేకుండా ముందుకు సాగుతున్నాం. ఉచిత విద్య, విద్యుత్, మంచినీటి సరఫరా తదితర అంశాలపై సింగరేణి ప్రత్యేక దృష్టి సారించింది.
- **లాభాల సాధనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?**
- సింగరేణి లాభాల్లో పయనించేందుకు ప్రతి ఒక్కరికీ సంస్థపై అవగాహన కల్పించాం. భారీయంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకుని పోటీ మార్కెట్‌కు అనుగుణంగా ముందుకు సాగుతున్నాం.
- **విదేశాల్లో కొత్తబొగ్గు గనుల లీజ్ ప్రయత్నాలు ఎలా ఉన్నాయి?**
- టెండర్‌లో పాల్గొని మనరాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాక్‌లు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. దీంతో బొగ్గు ఉత్పత్తితోపాటు ప్రత్యామ్నాయ వ్యాపారాలపై దృష్టి సారించాం. ఒడిశాలోని నైనీబ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తాం. సోలార్, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. తాజాగా జల, పవన విద్యుత్ తయారీ దిశగా చర్యలు చేపట్టాం.
- **ఉత్పత్తి, రవాణా ఎలా ఉంది?**
- పదేళ్లక్రితం ఏటా 52.54మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాం. ప్రస్తుతం 72మిలియన్ టన్నులు లక్ష్యంగా పెట్టుకున్నాం. గతేడాది రూ.37,500 కోట్ల టర్నోవర్ సాధించి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందాం.
- **కారుణ్య నియామకాలతో ఎన్ని కార్మిక కుటుంబాలకు లబ్ధి చేకూరింది?**
- సింగరేణిలో కారుణ్య నియామకాల ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటివరకు 16వేల మందికిపైగా కార్మికుల పిల్లలకు ఈ పథకం ద్వారా ఉద్యోగాలు కల్పించాం.
- **గని ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేమిటి?**
- బొగ్గు గనుల్లో ప్రమాదాల నియంత్రణ లక్ష్యంగా సింగరేణి ముందుకు సాగుతోంది. అసలు ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఉంది. సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్, నిత్యం ఉద్యోగులకు శిక్షణ అందించడం, గని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
- **భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రాజెక్టులు ఏమిటి?**
- ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తాం. వచ్చే ఐదేళ్లలో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడం లక్ష్యంగా నిర్దేశించాం. లోయర్ మానేరు డ్యామ్‌పై 300 మెగావాట్లు, మల్లన్నసాగర్‌పై 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. రాజస్థాన్‌లో మరో 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. ఇల్లెందులో మూతబడిన జేకే ఓసీపీ సంపు నీటితో 100 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తికి అధ్యయనం చేస్తున్నాం. ఎత్తయిన డంపులపై గాలిమరల ద్వారా పవన విద్యుత్ ఉత్పత్తికి యోచిస్తున్నాం. మణుగూరులో వేడినీటి వనరులను ఉపయోగించి ప్రయోగాత్మకంగా 'జియో థర్మల్ విద్యుత్' కేంద్రం ఏర్పాటు చేశారు. ఇది విజయవంతమైన నేపథ్యంలో ఇతర ప్రాంతాల్లో 200 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు యత్నిస్తున్నాం. కొత్త గనులు, మూసివేసే వాటిస్థానంలో కొత్తవి తవ్వించడంపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



విష్ణువర్ధన్



ముస్త్యాల శ్రీరాం



తల్లిదండ్రులతో పెండెం బాలాజీ

రామగుండం/పెద్దపల్లిరూరల్: రామగుండం పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు పాలిసెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఆటోడ్రైవర్ ముస్త్యాల శంకర్‌లింగం కుమారుడు శ్రీరాం 65వ ర్యాంక్ సాధించాడు. ఇతడు లింగాపూర్ మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివాడు. పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించాడు. పాలిసెట్ ఎంపీసీ స్ట్రీమ్‌లో రాష్ట్రస్థాయిలో 65వ ర్యాంక్, ఎంబైపీసీ స్ట్రీమ్‌లో 27వ ర్యాంకు సాధించాడు. ప్రిన్సిపాల్ సారా తస్నీమ్, బోధన సిబ్బంది తదితరులు అభినందించారు.

రైల్వే ఉద్యోగి కుమారుడికి 101వ ర్యాంక్

స్థానిక రైల్వేస్టేషన్ కమర్షియల్ విభాగంలో విధులు నిర్వర్తించే దాసరి ప్రసాద్ – లక్ష్మి దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ ఎంబైపీసీ స్ట్రీమ్‌లో 101వ ర్యాంక్ సాధించాడు. విష్ణువర్ధన్ పెద్దపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదివాడు. టెన్త్‌లో 9.8 జీపీఏ సాధించాడు. టీఎస్ ఆర్జేసీలోనూ 150 మార్కులను 135 మార్కులు సాధించాడు.

ఆటోడ్రైవర్ కుమారుడికి 123వ ర్యాంక్..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెగడపల్లికి చెందిన పెండెం బాలాజీ పాలిసెట్‌లో 123వ ర్యాంక్ సాధించాడు. గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, గర్రెపల్లి బీసీ వెల్ఫేర్ గురుకులంలో హైస్కూల్ విద్య చదివాడు. అతడి తల్లి రమ్య కూలీపని చేస్తుండగా, తండ్రి కుమారస్వామి ఆటోడ్రైవర్. కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తిచేసి ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి ఎదగాలనేది తన లక్ష్యమని బాలాజీ తెలిపాడు. తనకు ఏపీజే అబ్దుల్‌కలామ్, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తి అని వివరించాడు. విద్యార్థి తల్లి పదో తరగతి, తండ్రి ఏడో తరగతి వరకు చదివారు. వీరికి ఇద్దరు బాలాజీ, యశ్వంత్ కుమారులు. వారిని ఉన్నతంగా చదివించాలనేది తమ లక్ష్యమని తల్లిదండ్రులు తెలిపారు.

'ఇవి ఆర్‌ఎఫ్‌సీఎల్ భూములు'

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) కర్మాగారం భూములు కబ్జాకు గురికాకుండా యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఈమేరకు లక్ష్మీపురం గ్రామ శివారులోని ఆర్ఎఫ్‌సీఎల్ భూముల్లో సోమవారం సూచిక బోర్డు ఏర్పాటు చేసింది. కొందరు కబ్జాదారులు పంటలు పండిస్తూ, మట్టి తీస్తూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని యాజమాన్యం గుర్తించి ఈ చర్యలు తీసుకుంది. ఆర్ఎఫ్‌సీఎల్ భూముల్లో నిర్మాణాలు చేపట్టినా, కబ్జా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.



భూముల్లో ఏర్పాటు చేసిన బోర్డు

గులాబీ పార్టీదే తెలంగాణ

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రజల చిరకాల కోరిక ప్రత్యేక రాష్ట్రం సాధించడంతో సాకారమైందని, సకలజనులతో కలిసి పోరాడి సాధించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన పదేళ్ల పాలనలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం 'పదేండ్ల పండుగ' ముగింపు ఉత్సవాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, నాయకురాలు దాసరి ఉష, జెడ్పీటీసీ గంట రాములు తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వృద్ధులకు ఆసరా పింఛన్లు, కోతల్లేని విద్యుత్ సరఫరా, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులతో జలకళ, రైతులకు పెట్టుబడిసాయం, అందుబాటులో విత్తనాలు, ఎరువులు ఉంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు మోసపూరిత హామీలు ఇచ్చి మొన్నటి ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, నాయకులు గోపు ఐలయ్యయాదవ్, రఘువీర్‌సింగ్, బండారి శ్రీనివాస్, శ్రీధర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో మాజీమంత్రి ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ మధు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్, మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

కౌంటింగ్‌కు మూడంచెల భద్రత

- జేఎన్టీయూ, ఐజాలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు
- 733 మంది పోలీసు అధికారులు, 6 స్పెషల్ పార్టీలు.
- విజయోత్సవాలకు ఎలాంటి అనుమతి లేదు
- రామగుండం సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పెద్దపల్లి పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో.. సాఫీగా సాగేందుకు పోలీసు శాఖ మూడంచెల భద్రత చేపట్టింది. ఈ మేరకు రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లా మంథని జేఎన్టీయూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ఏసీపీలు, సీఐలు, ఎస్సైలతోపాటు పోలీసు సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలు పహారా కాస్తున్నాయి.

బందోబస్తులో 733 మంది పోలీసు అధికారులు

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని కౌంటింగ్ కేంద్రాల వద్ద మంగళవారం ఉదయం 6గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తారు. ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో ఒక కిలో మీటరు పరిధి వరకు నిషేధం అమలులో ఉంటుంది. కౌంటింగ్ కేంద్రాల సమీపంలో టపాసులు కాల్చవద్దు. జనాలను నియంత్రించేందుకు ఇప్పటికే పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జారీచేసిన ఫొటో గుర్తింపుకార్డు చూపిస్తేనే కౌంటింగ్‌హాల్‌లోకి అనుమతి ఇస్తారు. మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, లైటర్ల వంటి నిషేధిత వస్తువులకు అనుమతిలేదు. ఓట్ల లెక్కింపు తర్వాత విజయోత్సవ ర్యాలీలపైనా నిషేధం విధించారు. విజయోత్సవ ర్యాలీలకు సంబంధిత పోలీస్ అధికారుల నుంచి రాతపూర్వకంగా అనుమతి పొందాలి. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, కౌంటింగ్ సిబ్బందికి సహకరించేలా సమన్వయం చేసుకుంటున్నారు. అంతేకాదు.. కౌంటింగ్ అధికారులు, అభ్యర్థులు, ప్రధాన ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు, పోలీసులు నిబంధనల ప్రకారం తమ విధులు నిర్వర్తించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద సీపీ శ్రీనివాస్



సిద్ధంగా ఉన్న ఓట్ల లెక్కింపు కేంద్రం

లెక్కింపు పూర్తయ్యేంత వరకు అప్రమత్తం

రామగిరి(మంథని): ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ పోలీసు సిబ్బందికి సూచించారు. మంథని జేఎన్టీయూలోని ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం కౌంటింగ్ సెంటర్‌లోని సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీలు రమేశ్, కృష్ణ, రాఘవేంద్రరావు, సర్కిల్‌పాలు, సీఐ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

అనుమతి లేనివారు రావొద్దు

సజావుగా ఓట్ల లెక్కింపు జరిగేందుకు పోలీసుశాఖ అన్ని ఏర్పాటు పూర్తిచేసింది. లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేశాం. అనుమతిలేని వారెవరూ ఆప్రాంతానికి రావద్దు. విజయోత్సవ ర్యాలీల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకోం. ఎన్నికల ప్రవర్తన ఉల్లంఘన కింద కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసుశాఖ సూచనలు పాటించి ఓట్ల లెక్కింపునకు సహకరించాలి.

– శ్రీనివాస్, పోలీస్ కమిషనర్, రామగుండం

పోలీసు బలగాల కేటాయింపు ఇలా..

	పెద్దపల్లి జిల్లా :	మంచిర్యాల జిల్లా :
ఏసీపీలు	05	05
సీఐలు	16	14
ఎస్సైలు	36	40
ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు	99	112
కానిస్టేబుళ్లు	102	96
మహిళా పోలీసులు	22	21
హోంగార్డులు	87	80
స్పెషల్ పార్టీలు	03	03
కేంద్ర బలగాలు(ప్లటూన్)	1	1

క్లుప్తంగా

పాల ట్యాంక్‌లో పడి.. అనంతలోకాలకు

- మృతుడు డెయిరీలో టెక్నికల్ ఆఫీసర్


ముఖేశ్ మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు పాల ట్యాంక్‌లో పడి, మృతిచెందాడు ఓ డెయిరీ టెక్నికల్ ఆఫీసర్. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణ జిల్లా నందిగామకు చెందిన షేక్ ముఖేశ్(44) జమ్మికుంట మండలం వెంకటేశ్వరపల్లిలోని ఎస్ఆర్‌కే డెయిరీలో టెక్నికల్ ఆఫీ సర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం ఈటీపీ ట్యాంక్‌ను పరిశీలిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి, అందులోనే పడిపోయాడు. గమనించిన మేనేజర్, సిబ్బంది ఆయనను బయటకు తీసి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య షేక్ కరీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రవి పేర్కొన్నారు.

మృతదేహం అప్పగింత

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మద్యం మత్తులో కిందపడి మృతి చెందిన రాజేశ్(30) వివరాలను గుర్తించామని టౌన్ సీఐ రవి తెలిపారు. మృతదేహాన్ని సోమవారం అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. రాజేశ్ మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బల్లార్షా వాసి అని పేర్కొన్నారు. మృతుడి తండ్రి నాగేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రెస్టారెంట్‌కు జరిమానా


తనిఖీ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ అధికారులు స్థానిక ఐబీ కాలనీలోని వైష్ణవి రెస్టారెంట్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. పాడైపోయిన చికెన్, గడువు తేదీ దాటిన పదార్థాలతో ఆహారం తయారు చేయడాన్ని గుర్తించారు. నిర్వాహకులకు రూ.10 వేల జరిమానా విధించారు. చట్ట ప్రకారం సదరు రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవడానికి ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్, నాగభూషణం, సునీల్, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్, వైకుంఠం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మెయిల్ చేసిన రిపోర్టర్‌పై కేసు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ షాకీర్‌ను డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేసిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ గట్టిపెల్లి రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. షాకీర్‌పై ఓ వృద్ధుడు రెండు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని తమ చానల్‌లో ప్రసారం చేయకుండా ఉండటానికి రూ.25 వేలు ఇవ్వాలని రాజశేఖర్ డిమాండ్ చేయగా, షాకీర్ రూ.5 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. అడిగిన మొత్తం ఇవ్వకపోవడంతో రాజశేఖర్ ఆ డబ్బులను తిరిగి ఆయనకు పంపించాడు. అనంతరం చానల్‌లో న్యూస్‌ను ప్రసారం చేయించాడు. దీంతో డబ్బుల కోసం తనను బ్లాక్ మెయిల్ చేయడమే కాకుండా అసత్యపు వార్తను ప్రసారం చేసి, తన పరువుకు భంగం కలిగించాడని షాకీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి అమ్మేందుకే కరీంనగర్ వచ్చారా?

- 70 కేజీల గంజాయితో దొరికిన ముగ్గురు జైలుకు..
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- ప్రధాన నిందితుడి కోసం ఆంధ్రా పోలీసుల గాలింపు
- అతన్ని కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి?


గంజాయి, నిందితులను చూపుతున్న పోలీసులు (ఫైల్)

కరీంనగర్ క్రైం: యువత మత్తుకు బానిసవుతుండటంతో గంజాయి వ్యాపారం ఊపందుకుంటోంది. ఫలితంగా యువకులకు విక్రయించేందుకు గంజాయి మాఫియా వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. కరీంనగర్ జిల్లాకు ఒడిశా, విశాఖపట్నం, అరకు ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇటీవల కరీంనగర్ తీగల వంతెన వద్ద ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఇద్దరు, మహారాష్ట్రకు చెందిన ఒకరు 70 కేజీల గంజాయిని కారులో తరలిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. సీజ్ చేసి, వారిని కరీంనగర్ జైలుకు తరలించారు. ఈ గంజాయిని మహారాష్ట్రకు తరలించి, అక్కడ విడిగా విక్రయించేందుకు నిందితులు సిద్ధమైనట్లు సమాచారం.

ఒకరు కరడుగట్టిన నేరస్తుడు..

వివిధ రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా చేస్తున్న నిందితులు కరీంనగర్‌కు దిగుమతి చేస్తున్నారు. వీరు ఇదే పనిగా దందా కొనసాగిస్తున్నారు. గతంలో అరకు, విశాఖపట్నం, భద్రాద్రి కొత్తగూడెం, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి రవాణా చేస్తూ పలుపురు పట్టుబడ్డారు. విచారణలో కరీంనగర్‌కు రైళ్లు, బస్సుల్లో తీసుకొచ్చి, ఇక్కడి కాలేజీ విద్యార్థులు, కార్మికులు, కూలీలను టార్గెట్‌గా చేసుకొని, అమ్మకాలు జరిపినట్లు తేలింది. తాజాగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా కరీంనగర్‌లో పట్టుబడిన వారిలో ఒకరు కరడుగట్టిన నేరస్తుడని, అతని కోసం ఆంధ్రా పోలీసులు కూడా కొన్ని రోజులుగా గాలిస్తున్నారని తెలిసింది. అయితే, ఆ వ్యక్తి పోలీసులు ఎంత విచారించినా నోరు మెదపకపోవడంతో జైలుకు తరలించారు. తిరిగి కస్టడీకి తీసుకుంటే మరింత సమాచారం వస్తుందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరికి గతంలో నేరచరిత్ర ఉందని, ఒకరు మాత్రం తాజాగా గంజాయి రవాణాలో పాలుపంచుకుంటున్నట్లు గుర్తించారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలించే క్రమంలో కరీంనగర్‌లోనూ గంజాయి అమ్మేందుకే ఇటుగా వస్తున్నారా అని అనుమానిస్తున్నారు. గంజాయి పండించేవారు మొదలు కిందిస్థాయిలో దాన్ని సేవించేవారిని సైతం పట్టుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట వేయవచ్చని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. గంజాయి పట్టుబడిన కేసులో ప్రధాన నిందితుడిని కస్టడీకి తీసుకుంటే ఇంకెలాంటి విషయాలు బయటకు వస్తాయో చూడాలి.

రాజన్న దర్శనానికి నాలుగు గంటలు



క్యూలైన్లలో భక్తులు, కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఈవో రామకృష్ణ కుటుంబసభ్యులు

- వేములవాడలో పోటెత్తిన భక్తులు
- క్యూలైన్లలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వేములవాడ: వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం దాదాపు 30 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఒక్కో భక్తుడికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లు కిక్కిరిసి ఉండడంతో ఉక్కపోతతో భక్తులు ఇబ్బంది పడ్డారు. సోమవారం కావడంతో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మహానివేదన నిర్వహించగా.. ఈ సమయంలో దర్శనాలు నిలిపివేశారు. ప్రసాదాల కొనుగోలు వద్ద తోపులాట జరిగింది. స్వామి వారిని ఆలయ ఈవో రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

అంజన్న పెద్ద జయంతి ఆదాయం రూ.1.51 కోట్లు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న పెద్ద జయంతి సందర్భంగా ఆలయానికి భారీగా ఆదాయం సమకూరినట్లు అధికారులు సోమవారం తెలిపారు. గత నెల 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా రూ.1,51,38,490 వచ్చినట్లు పేర్కొన్నారు. అత్యధికంగా మాల విరమణ ద్వారా రూ.31 లక్షలు వచ్చాయన్నారు. గత కొన్నేళ్లలో ఎప్పుడూ లేనంతగా 48 గంటలపాటు భక్తుల రద్దీ కొనసాగిందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

- 24 గంటలైనా పోస్టుమార్టం చేయని వైనం
- పోలీసుల తీరుపై మృతుడి కుటుంబసభ్యుల ధర్నా


ఎల్లయ్య (ఫైల్)


ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని గోరింట్యాలకు చెందిన గొల్లపల్లి ఎల్లయ్య(65) ఆదివారం ఉదయం గ్రామంలోనే సైకిల్‌పై వెళ్తుండగా.. కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు. అయితే, చనిపోయి 24 గంటలు దాటినా అక్కడ పోస్టుమార్టం చేయించడంలో స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు సోమవారం గోరింట్యాలలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఎల్లయ్య మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని త్వరగా అప్పగించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని, గాంధీ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తామని, న్యాయం జరిగేలా చూస్తామనడంతో ఆందోళన విరమించారు.

పలువురిపై కేసు..

రోడ్డుపై ధర్నా చేశారని కుమిరిశెట్టి మహేందర్, మెండే సుమన్, అలివేలి మురళి, శనిగరపు ముత్తయ్య, అలివేలి లక్ష్మయ్య, దండవేని మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

బావిలో పడిన శునకాన్ని రక్షించారు..


కుక్కను పైకి తీసుకొస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన వీధికుక్కను అగ్ని మాపక సిబ్బంది రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని ఓ వ్యవసాయ బావిలో నాలుగు రోజుల క్రితం ఓ శునకం పడిపోయింది. ఆహారం, నీరు లేక ఆకలితో అల్లాడుతోంది. సోమవారం దాని అరుపులు విన్న స్థానికులు స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి గౌతం, శ్రీలక్ష్మి జంతుసంరక్షణ ప్రతినిధి ఆసిరి సుమన్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని, అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. వారు వచ్చి, బావిలోకి నిచ్చెన ద్వారా దిగి, కుక్కను వలలో బంధించి బయటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం దాని ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉంది. ప్రాణాపాయస్థితిలో ఉన్న శునకాన్ని కాపాడినందుకు జంతుప్రేమికులు వారిని అభినందించారు.

వలస కార్మికుడి మృతిపై విచారణ


ఆధారాల కోసం చూస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలో వలస కార్మికుడు నాయక్ రసూల్(36) ఆదివారం ఉదయం మృతిచెందిన విషయం విదితమే. అతని మృతిపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం విచారణ చేపట్టారు. బంగ్లాపై మృతదేహం గుర్తించిన చోట రక్తపు మరకలు ఉండటం, బలమైన వస్తువుతో తలపై బాదడంతో చెవుల్లో నుంచి రక్తం వచ్చి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. భవన యజమాని పుట్టయ్య కుటుంబసభ్యులను ఏవైనా శబ్దాలు వినిపించాయా అని అడిగారు. ఆధారాల కోసం బిల్డింగ్ చుట్టుపక్కల ప్రాంతాలను గంటకు పై గా పరిశీలించారు. రెండు, మూడు చోట్ల రక్తపు మరకలు ఉన్న ట్లు గుర్తించారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో వెనుదిరిగారు. బంగ్లాపై అక్కడక్కడ రక్తపు మరకలను తుడిచి, నీటితో కడిగేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతుడి బంధువులపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారణ జరిపినట్లు సమాచారం.

దాడికి గురైన కాంగ్రెస్ నాయకుడి మృతి

- చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృత్యుఒడికి..
- పథకం ప్రకారమే చేశారన్న మృతుడి సోదరుడు
- ఆస్పత్రి వద్ద పోలీసులపైనా నిందితుల దాడి
- మాజీ సర్పంచ్ సహా అరుగురిపై కేసు
- ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు : విప్ 'అడ్లూరి'


నరేశ్ (ఫైల్)


పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి రేండ్ల నరేశ్(40) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనపై దాడి చేసి, మృతికి కారణమైన అరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నరేశ్ సోదరుడు సతీశ్ కథనం ప్రకారం.. రేండ్ల నరేశ్ కటికెనపల్లిలో గత ఐదేళ్లలో సిమెంట్ రోడ్ల అభివృద్ధి పనుల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఆర్టీఐకి దరఖాస్తు చేశాడు. పనుల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, చామనపల్లి భూ విషయంలో అతని ప్రోత్సాహంతోనే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని మాజీ సర్పంచ్ కారుపాకల రాజయ్య అనుమానించాడు. నరేశ్‌ను ఎలాగైనా చంపాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనకు ఆరోగ్యం బాగా లేదని చెప్పి, రాజయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరాడు. అంతకుముందే నరేశ్‌ను చంపాలని, ఏదైనా తాను చూసుకుంటానని తన కుమారులు కారుపాకల కుమార్, వెంకటేశ్‌లతోపాటు బోనగిరి శ్రీనివాస్, పొటకుల బుచ్చి రాములు, జంగిలి చిన్న రవిలకు చెప్పాడు. దీంతో వారు ఆదివారం ఎండపల్లి మండలంలోని రాజా రాంపల్లి వైన్స్‌లో మద్యం సేవించారు. వెంకటేశ్ అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌లో ఉన్న తండ్రి వద్దకు వెళ్లాడు. అదేరోజు రాత్రి బుచ్చిరాములు, చిన్న రవి రేండ్ల నరేశ్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించగా కుమార్, శ్రీనివాస్ బైక్‌పై అతను కొత్తగా నిర్మిస్తున్న ఇంటి సమీపంలో ఉంటున్న గది వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లి నరేశ్‌పై పారలతో విచక్షణారహితంగా దాడి చేశారు. అతను చనిపోయాడని భావించి, అక్కడి నుంచి బుచ్చిరాములు ఇంటికి వెళ్లారు. నరేశ్‌ను కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి చనిపోయాడు. మృతుడి తమ్ముడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజయ్య, కుమార్, వెంకటేశ్, బుచ్చిరాములు, చిన్న రవి, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

పాడె మోసిన ప్రభుత్వ విప్..

నరేశ్ మృతదేహం సోమవారం కటికెనపల్లికి చేరింది. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుమారుడు రాంచందర్‌రెడ్డి వచ్చి, నివాళి అర్పించారు. అనంతరం భారీగా తరలివచ్చిన గ్రామస్తులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. విప్ లక్ష్మణ్‌కుమార్ పాడె మోశారు. మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రూప్లానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ కాడె సూర్యనారాయణ తదితరులున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా..

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నరేశ్‌పై పలుమార్లు దాడులు జరిగాయని, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విప్ లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ప్రత్యర్థులతో ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పోలీసుల అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా గాడితప్పిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత


ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

కరీంనగర్‌క్రైం: రేండ్ల నరేశ్‌ను తీసుకెళ్లిన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఆదివారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు దవాఖానా వద్దకు రావడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. వీరు హత్య కేసులో ఉన్న ఒకరికి బంధువులు అని తెలిసింది. అక్కడే ఉన్న ధర్మారం ఎస్సై సత్యనారాయణ ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతుందని భావించి, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, వారు వినలేదని, విధుల్లో ఉన్న తమపై దాడి చేశారని కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి వద్ద ఘటనను కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు.

చెట్టు కొమ్మ పడి వృద్ధుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని మంచిరామికి చెందిన బొత్యారి చంద్రయ్య(60) చెట్టు కొమ్మ పడటంతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చంద్రయ్య సోమవారం తన ఇంటి సమీపంలోని చెట్టును నరికేస్తున్నాడు. ఈ క్రమంలో కొమ్మను తాడుతో లాగుతుండగా ఒక్కసారిగా విరిగి, అతని మీద పడింది. అక్కడున్నవారు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య అమృతమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో దాడి.. ముగ్గురికి గాయాలు


గాయపడిన మొయినొద్దీన్

కోరుట్ల: అద్దె కుటుంబాల మధ్య బాత్‌రూం శుభ్రం చేసే విషయంలో జరిగిన గొడవ కత్తితో దాడి చేసేవరకు వెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ముగ్గురిపై కత్తిపోట్లకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణానికి చెందిన అజార్ పాషా, మహారాష్ట్రకు చెందిన సఫి–సరయ దంపతులు పట్టణంలోని హాజీపురలో గల ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో అద్దెకు ఉంటున్నారు. అజార్ పాషా పాత సామగ్రి కొనుగోలు వ్యాపారం చేస్తుండగా సఫి ప్రైవేట్ పనులు చేస్తుంటాడు. కాగా, సోమవారం బాత్‌రూం శుభ్రం చేసే విషయంలో రెండు కుటుంబాలవారు గొడవ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన అజార్ పాషా తన వద్ద ఉన్న కత్తితో సఫిపై దాడికి యత్నించాడు. సఫి మామయ్య సయ్యద్ మొయినొద్దీన్, కూతురు సనాపై, అదే దారిలో వెళ్తున్న గోదావరి అనే మహిళ అడ్డురావడంతో ఆమెపైనా దాడి చేశాడు. మొయినొద్దీన్, సనాకు తీవ్ర, గోదావరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులకు కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మొయినొద్దీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సఫి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

అప్పుల బాధతో మహిళ..


లక్ష్మి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పులు చేసి, గల్ఫ్ వెళ్లిన భర్త అక్కడ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఇంటికి వచ్చాడు.. దీంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపానికి గురైన అతని భార్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన బొదాసు లక్ష్మి(42) గ్రామంలో కూలీ పనులకు వెళ్తోంది. ఆమె భర్త నర్సయ్య 8 నెలల క్రితం అప్పులు చేసి, ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అక్కడి కంపెనీలో పని సరిగా దొరకలేదు. ఈ క్రమంలోనే రెండు నెలల క్రితం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని నడుము, కాలు విరగడంతో స్వగ్రామం తిరిగొచ్చాడు. భర్త డబ్బులు సంపాదించుకురాలేదని, అప్పులు ఎలా తీర్చేదని లక్ష్మి మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలికి కుమారుడు నాని, కూతురు చిన్ని ఉన్నారు. భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ కోరారు.

పడకల్‌వాసి..

వెల్గటూర్ (ధర్మపురి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పడకల్‌కు చెందిన పడకాపురం శ్రీనివాస్(44) గతంలో ప్రైవేటు ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఇందుకోసం చేసి అప్పు సమయానికి తీర్చలేకపోయాడు. మార్గం కనిపించకపోవడంతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సోమవారం గ్రామ శివారులోని ఒర్రె గడ్డపై కరెంట్ వైరుతో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని చూసి, పోలీసులకు సమాచారం అందించారు. వారు శ్రీనివాస్‌గా గుర్తించి, కుటుంబసభ్యులకు తెలిపారు. అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య శ్యామల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

భర్త మాట్లాడటం లేదని భార్య..


మమత (ఫైల్)

గన్నేరువరం(హుస్నాబాద్): భర్త మాట్లాడటం లేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన టేకు జోగయ్యకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కూతురు మమత(27)కు గ్రామానికే చెందిన పత్తి దుర్గాప్రసాద్‌తో వివాహం జరిపించారు. ఈ దంపతులకు పదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో జీవనోపాధి కోసం దుర్గాప్రసాద్ రెండు నెలల క్రితం ఝార్ఖండ్ వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి తనతో మాట్లాడటం లేదని, ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని మమత మనస్తాపానికి గురైంది. సోమవారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తండ్రి జోగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.

వీర్నపల్లి మండలంలో బాలిక..

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తండ్రి సోమవారం ఉదయాన్నే మేకలను మేపేందుకు అడవికి, తల్లి ఉపాధిహామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని, ఇంటికి వచ్చి చూడగా వారి కూతురు దూలానికి ఉరేసుకొని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాలుగేళ్లుగా మంచంపట్టి.. మృత్యుఒడికి

- అనారోగ్యంతో పవర్‌లూమ్ కార్మికుడి మృతి
- ఇద్దరు ఆడపిల్లలు సంతానం
- మొదటి కూతురి ఇద్దరు ఆడపిల్లల బాధ్యత ఈ కుటుంబానిదే..
- చివరకు చందాల ద్వారా అంత్యక్రియలు


భర్త శ్రీనివాస్ మృతదేహంపై పడి రోదిస్తున్న పద్మ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆయన పవర్‌లూమ్ కార్మికుడు.. ఈ పని చేస్తూనే భార్య, ఇద్దరు కూతుళ్లను పోషించాడు.. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మంచం పట్టాడు.. పెద్ద కూతురు ఆత్మహత్య చేసుకుంది. అల్లుడు వదిలేయడంతో వారి ఇద్దరు ఆడపిల్లల బాధ్యత ఈ కుటుంబానిదే.. ఈ పరిస్థితుల్లో విధి ఆ కుటుంబాన్ని వెక్కిరించింది. పని చేయకున్నా ఇంటి పెద్ద ఉన్నాడన్న వారి ధైర్యాన్ని దూరం చేస్తూ ఆయనను తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కూచన శ్రీనివాస్(55) పవర్లూమ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ నాలుగేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఆయనకు భార్య పద్మ, కూతుళ్లు శిరీష, సాయిలత ఉన్నారు. పెద్ద కూతురికి పెళ్లి చేయగా ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. ఆమె గతంలో ఆత్మహత్య చేసుకుంది. అల్లుడు ఇద్దరు పిల్లలను వదిలేయడంతో వీరి వద్దే పెరుగుతున్నారు. ప్రస్తుతం పెద్ద పాప మూడో తరగతి, చిన్న పాప రెండో తరగతి స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు.

కుటుంబానిది దీనస్థితి..

శ్రీనివాస్ భార్య పద్మ ఎవరి ఇళ్లలోనైనా మంచం పట్టిన వృద్ధులుంటే వారికి సేవలందిస్తూ అలా వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. చిన్న కూతురు సాయిలత అమ్మకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు బీడీలు చుడుతోంది. శ్రీనివాస్‌కు కావాల్సిన మందులు తెస్తూ, ఇద్దరు చిన్నపిల్లల ఆలనాపాలన చూస్తున్న వీరికి పెద్ద కష్టం వచ్చింది. మృత్యువుతో పోరాడుతున్న ఇంటి పెద్ద శ్రీనివాస్ సోమవారం మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చందాలతో దహన సంస్కారాలు

నిరుపేద కుటుంబం కావడంతో శ్రీనివాస్‌కు దహన సంస్కారాలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబసభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గ్రామస్తులే తలాకొంత పోగేయడంతో రూ.10 వేలు జమయ్యాయి. దీంతో రాత్రి అంత్యక్రియలు పూర్తి చేశారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.